క్లుప్తంగా

రైల్వేస్టేషన్లలో పరిశుభ్రతపై అవగాహన



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): స్వచ్ఛత పఖ్వాడా–2025 కార్యక్రమంలో భాగంగా విజయవాడ డివిజన్ వ్యాప్తంగా 'స్వచ్ఛత స్పర్థ దివస్' కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 1 నుంచి 15 వరకు డివిజన్‌లో స్పెషల్ క్లీన్‌లెస్ క్యాంపెయిన్ 5.0 నిర్వహిస్తున్నారు. విజయవాడ రైల్వే డీఆర్‌ఎం మోహిత్ సోనాకియా మార్గదర్శకత్వంలో డివిజన్‌లోని పలు స్టేషన్‌లలో పారిశుద్ధ్య సిబ్బంది, రైల్వే ఉద్యోగులు, కాంట్రాక్స్ వర్కర్స్, సూపర్‌వైజర్‌లకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. రైల్వేస్టేషన్‌ల ప్రాంగణంలో పరిశుభ్రతను కాపాడుకోవడం పట్ల ఉద్యోగులందరూ సమష్టి బాధ్యతను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం లక్ష్యం అన్నారు. పరిసరాల్లో చెత్త, వ్యర్థాలు వేయడం వలన కలిగే హానికరమైన చర్యలపై అవగాహన కల్పించేందుకు స్టేషన్‌లు, రైల్వే కాలనీల్లో ప్రచారంతో ప్రయాణికులు, సాధారణ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్ పట్ల భారతీయ రైల్వేల నిబద్ధతకు అనుగుణంగా పరిశుభ్రత, ప్రయాణికులకు అనుకూలమైన రైల్వే వాతావరణ దార్శనికతను బలోపేతం చేసేందుకు ఈ ప్రచార కార్యక్రమాలు దోహదం చేస్తాయని డీఆర్‌ఎం తెలిపారు. అనంతరం ఈ పోటీల్లో గెలుపొందిన వాళ్లకు ఆయా స్టేషన్‌ల అధికారుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

బార్ కౌన్సిల్ అర్హత పరీక్ష కేంద్రం ఏర్పాటుపై హర్షం



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆలిండియా బార్ కౌన్సిల్ అర్హత పరీక్షా కేంద్రాన్ని విజయవాడలో ఏర్పాటు చేయడంపై ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆలిండియా బార్ కౌన్సిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడలో ఈ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల అర్హత పరీక్షకు హాజరయ్యే ఎంతోమంది యువ న్యాయవాదులకు చాలా సౌలభ్యంగా ఉంటుందన్నారు. ఈ విషయంలో మొదటిగా చొరవ చూపిన న్యాయవాది పి.ప్రసాదరావుని అభినందించారు. ఈ కేంద్రం ఏర్పాటులో ఆలిండియా బార్ కౌన్సిల్ వారితో సంప్రదించి ఎంతో కృషి చేసిన చలసాని అజయ్‌కుమార్‌ను న్యాయవాది ప్రసాదరావు తన మిత్ర బృందంతో కలిసి సత్కరించారు.

పూడికతీత పనులు చేపట్టండి



పటమట(విజయవాడతూర్పు): నగరంలో వర్షపు నీటి నిల్వలు రోడ్లపైన ఉండకుండా విస్తృతంగా డీసిల్టింగ్ పనులను చేపట్టాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర అధికారులను ఆదేశించారు. వన్ టౌన్ నైజాం గేట్ పాత రాజరాజేశ్వరి పేట ప్రాంతాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు డ్రెయిన్లను పర్యవేక్షిస్తుండాలని సూచించారు. పాత రాజరాజేశ్వరి పేట రైల్వే గేట్ వద్దన్న డ్రెయిన్‌ను డ్రోన్ ద్వారా పరిశీలించి త్వరగా నిర్మాణ పనులను మొదలు పెట్టాలని ఆదేశించారు. డ్రెయిన్‌లో నుంచి తొలగించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు రోడ్డుపై కాకుండా వాటిని అక్కడ నుంచి తరలించాలని ఆదేశించారు. లేదంటే అవి మళ్లీ అదే డ్రెయిన్లలో పడి సమస్య పునరావృతం అవుతుందన్నారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె. శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ జాస్మిన్, తదితరులు పాల్గొన్నారు.

17న సిద్ధార్థ ఆడిటోరియంలో నవోన్మేషికోత్సవ్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా ఈ నెల 17వ తేదీ సిద్ధార్థ ఆడిటోరియంలో నవోన్మేషికోత్సవ్–2025 పేరుతో అంతర్రాష్ట్ర సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నామని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. స్థానిక కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కర్ణాటక గాత్రం సోలో, శాస్త్రీయ వాద్యం, బృందగానం, జానపద గేయాల ఆలాపన, ఫోక్ గ్రూప్ డాన్స్, శాస్త్రీయ నృత్యం, స్కిట్, మైమ్, మిమిక్రీ అంశాల్లో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

నకిలీ మద్యంపై ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

- సిట్ కాదు సీబీఐతో విచారణ జరిపించాలి
- ప్రభుత్వమే మద్యం దుకాణాలను నడపాలి
- నకిలీ మద్యానికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- బెల్ట్ షాపులు తగ్గిస్తామని లోకేష్ చెప్పటం సిగ్గుచేటు
- భవానీపురం ఎక్సైజ్ స్టేషన్ వద్ద వైఎస్సార్ సీపీ నిరసనలో మాజీ మంత్రి, పశ్చిమ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు



నకిలీ మద్యానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు



ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ): నకిలీ మద్యంపై తాము చేస్తున్న పోరాటంలో ఇది ఆరంభం మాత్రమే. నకిలీ మద్యాన్ని అరికట్టకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, నకిలీ మద్యం తయారీ, అమ్మకాలపై ప్రభుత్వ జేబు సంస్థ సిట్‌తో విచారణ కాదు సీబీఐతో విచారణ జరిపించాలని... విద్యాధరపురంలోని శ్రీనివాస వైన్స్‌లో నకిలీ మద్యం అమ్ముతున్నట్లు తేలినా దానిని మూసివేసి ఎందుకు చర్యలు తీసుకోలేదు అంటూ మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. నకిలీ మద్యం తయారీని ఒక కుటీర పరిశ్రమలా మార్చి రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తున్న టీడీపీ నాయకుల వైఖరి, కూటమి ప్రభుత్వ మద్యం విధానాలకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ రణభేరి మోగించింది. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు సోమవారం వెలంపల్లి శ్రీనివాస్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, షేక్ ఆసిఫ్, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున భవానీపురంలోని ఎక్సైజ్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఒక వైపు వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా ప్లకార్డులతో భారీ ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ భవానీపురం స్టేషన్ సీఐ గోపాలకృష్ణకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు సమర్పించారు.

పరిశ్రమలంటే మద్యం కుటీర పరిశ్రమలా....

పరిశ్రమలు తీసుకురావడమంటే మద్యం కుటీర పరిశ్రమలను తీసుకురావడమా అంటూ వెలంపల్లి ఎద్దేవా చేశారు. తనకు డిస్టలరీలు ఉన్నాయని జయచంద్రారెడ్డి ఎన్నికల అఫడవిట్‌లో పేర్కొంటే టీడీపీ టికెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. నకిలీ మద్యం దొరకగానే జయచంద్రారెడ్డి కోవర్ట్ అనటం చంద్రబాబు సిగ్గులేని తనానికి నిదర్శనమన్నారు. గతంలో ప్రభుత్వమే మద్యం షాపులను నిర్వహించటం వలన నకిలీ మద్యం అంశం తలెత్తలేదని గుర్తు చేశారు. ప్రభుత్వమే మద్యం షాపులను నిర్వహించాలని డిమాండ్ చేశారు. మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకుని డబ్బు సంపాదించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఉన్న బెల్ట్ షాపులను జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటన్నింటినీ మూసివేయించారని, చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వచ్చి ఆ బెల్ట్ షాపులను తెరిపించి నకిలీ మద్యం అమ్మిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని బెల్ట్ షాపులను తగ్గిస్తామని మంత్రి లోకేష్ చెప్పడం సిగ్గుచేటన్నారు. నకిలీ మద్యం కారణంగా చనిపోయినవారిని గుర్తించి వారి కుటుంబాలను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చంద్రబాబు, పవన్‌లకు ఇప్పుడు పూనకాలు రావే?

ఎన్నికల సమయంలో పూనకాలు వచ్చినట్లు ఊగిపోయిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు నకిలీ మద్యం విషయంలో ఇప్పుడు రావేమిటని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రశ్నించారు. సంపద సృష్టించడం అంటే నకిలీ మద్యం పరిశ్రమల ద్వారా కాదని ఎద్దేవ చేశారు. నకిలీ మద్యం విక్రయాల ద్వారా మహిళల తాళి బొట్లు తెంచడానికి చంద్రబాబు పూనుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి మూడు మద్యం బాటిల్స్‌లో ఒక నకిలీ మద్యం బాటిల్ ఉంటుందని అన్నారు. నకిలీ మద్యాన్ని పూర్తిగా అరికట్టే వరకు వైఎస్సార్ సీపీ ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు.

ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం....

ఇంటింటికీ రక్షిత మంచినీరు అందించలేని కూటమి ప్రభుత్వం నకిలీ మద్యాన్ని సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని వైఎస్సార్ సీపీ నేత షేక్ ఆసిఫ్ అన్నారు. నకిలీ మద్యంపై ప్రశ్నించాల్సిన పవన్ కల్యాణ్ చంద్రబాబుకు వత్తాసు పలకడం సిగ్గుచేటు అన్నారు. నకిలీ మద్యం గుట్టు పూర్తిగా తేల్చేందుకు వైన్‌షాపులు, పర్మిట్ రూమ్‌లు, బార్లు, బెల్ట్ షాపుల్లో ఎక్సైజ్ శాఖ విస్తృతంగా తనిఖీలు చేసి దాని వెనుక ఎంత పెద్ద వారున్నా అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బడులు, గుడులు, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన వైన్ షాపులు, బార్ల లైసెన్స్‌లను రద్దు చేసేలా ప్రభుత్వానికి ఎక్సైజ్ శాఖ సిఫార్స్ చేయాలని పేర్కొన్నారు.



నినాదాలు చేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

నకిలీ మద్యం విలయతాండవం చేస్తోంది....

వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ బండి పుణ్యశీల మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ మద్యం విలయతాండవం చేస్తుందని అన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మద్యం మరణాలు లేవని కాగ్ రిపోర్ట్ చెప్పిందని గుర్తు చేశారు. పదహారు నెలల కూటమి ప్రభుత్వంలో నకిలీ మద్యంతో వేల మంది చనిపోయారని చెప్పారు. నకిలీ మద్యం ద్వారా తమ సొంత మనుష్యుల జేబులు నింపేలా వ్యవహరిస్తున్న ప్రభుత్వానికి నూకలు చెల్లాయని అన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి నకిలీ మద్యాన్ని అరికట్టాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వివిధ పార్టీ పదవుల్లో ఉన్న నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పేదలకు వైద్యం దూరం చేసేందుకు కూటమి కుట్ర



సంతకాల సేకరణ ప్రారంభిస్తున్న వెలంపల్లి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

కోటి సంతకాల సేకరణను ప్రారంభించిన వెలంపల్లి, మేయర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పేదలకు వైద్యాన్ని పూర్తిగా దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోటి సంతకాల కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో 2019 వరకూ 12 మెడికల్ కళాశాలలు ఉంటే జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత దాదాపు 17 మెడికల్ కళాశాలలకు భూములు కేటాయించి పనులను ప్రారంభించారన్నారు. అందులో ఏడు కళాశాలలు పూర్తి చేసి వైద్య విద్యా తరగతులకు సిద్ధం చేశారన్నారు. వైద్య విద్యా బోధన సైతం కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాల్లో ప్రారంభమైందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మెడికల్ సీట్లు వద్దు అని కేంద్ర ప్రభుత్వానికి లేక రాసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీని పూర్తిగా నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. ప్రైవేటు వ్యక్తుల లాభాపేక్ష కోసం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. కోట్ల రూపాయలకు మెడికల్ సీట్లు అమ్ముకుంటున్నారన్నారు. అక్టోబర్ 10 నుంచి నవంబర్ 24 వరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని దశల వారీగా నిర్వహిస్తామన్నారు. అనంతరం గవర్నరు దృష్టికి ప్రైవేటీకరణ దుర్మార్గాన్ని తీసుకెళ్తామని చెప్పారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి కార్పొరేటర్లు మండేపూడి ఛటర్జీ, శిరంశెట్టి పూర్ణ, ఆంజనేయరెడ్డి, పీ చైతన్యరెడ్డి, ఇర్ఫాన్, యలకల చలపతిరావు, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ హాయత్ తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడి కాలనీలో పైపులైన్‌కు లీకేజీ



వంతెనపై పైపులైన్ నుంచి లీకవుతున్న నీళ్లు



బురదమయంగా మారిన ప్రాంతం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కాలనీలో బిందెడు నీళ్లు దొరకడమే కష్టం.. అటువంటిది గత కొద్ది రోజులుగా పైపులైన్ నుంచి పెద్ద ఎత్తున నీరు వృథాగా పోతున్నా కార్పొరేషన్ అధికారులకు పట్టడం లేదు. కాలనీలోని బుడమేరు కాల్వ వంతెనపై పైపులైన్ నుంచి నీరు వృథాగా పోతుంది. దీంతో స్థానికులు కార్పొరేషన్ అధికారులకు సమాచారం అందించారు. అయితే లీకేజీ వద్ద ఓ ప్లాస్టిక్ సంచి చుట్టి చేతులు దులుపేసుకున్నారు. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. లీకేజీ నుంచి వృథాగా పోతున్న నీళ్ల వంతెనతో పాటు చుట్టు పక్కల ఉన్న పరిసరాలను బురదమయంగా చేస్తున్నాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో బురదమయంగా మారుతున్న రోడ్లు, రోడ్డు మార్జిన్లను ఈ నీరు ముంచెత్తడంతో దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే వంతెనపై నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రైతు బజార్‌ను అందుబాటులోకి తేవాలి

సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు



వించిపేటలో రైతు బజార్‌ను ప్రారంభించాలని ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నేతలు

వించిపేట(విజయవాడపశ్చిమ): పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నివాసముంటున్న వించిపేటలో రైతు బజార్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు తాడి పైడియ్య అధ్యతన 55వ డివిజన్‌లోని 174, 186 సచివాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ వించిపేట ప్రాంత వాసుల విజ్ఞప్తుల మేరకు 55వ డివిజన్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌లో రైతు బజార్, మొదటి అంతస్తులో మీ–సేవా కేంద్రం కోసం 2017లో నగర పాలక సంస్థ జీ ప్లస్ భవన నిర్మాణం చేపట్టింది. అనంతరం భవన నిర్మాణం పూర్తికాగా అందులో మొదటి అంతస్తులో వార్డు సచివాలయం ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. కానీ గ్రౌడ్ ఫ్లోర్‌లో రైతు బజారు షాపులకు లబ్ధిదారులను ఎంపిక చేయడంలో అధికారుల నిర్లక్ష్యం వల్ల నేటికీ రైతు బజారులో షాపులు కేటాయింపులు జరుగలేదన్నారు. దీంతో ఈ ప్రాంగణం నిరుపయోగంగా మారి రాత్రుళ్లు అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి రైతు బజారు షాపులకు లబ్ధిదారులను గుర్తించి తక్షణమే షాపులను కేటాయించాలని కోరారు. లేని పక్షంలో ప్రజలతో కలసి ఆందోళన చేస్తామని తెలిపారు. నాయకులు బోర రామకృష్ణ, మోకా దుర్గారావు, మురుగేషన్ రాము, పగిదికత్తుల రాము పాల్గొన్నారు.

భారత్‌పై ట్రంప్ టారిఫ్ యుద్ధాన్ని వ్యతిరేకించాలి

సీపీఎం నగర కమిటీ కార్యదర్శి సత్యబాబు



ట్రంప్ సుంకాల యుద్ధం ప్రచార పుస్తకాలని ఆవిష్కరిస్తున్న సత్యబాబు

వించిపేట(విజయవాడపశ్చిమ): దేశ వ్యవసాయ రంగం, చిన్న, మధ్య తరగతి పారిశ్రామిక రంగాన్ని దివాలా తీస్తున్న సామ్రాజ్యవాద ట్రంప్ చర్యలను వ్యతిరేకిస్తూ సీపీఎం, సీపీఐ కేంద్ర కమిటీ పిలుపు దేశవ్యాప్త ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సీపీఎం నగర కమిటీ కార్యదర్శి బోయి సత్యబాబు తెలిపారు. కొత్తపేటలోని మోటూరి హనుమంతరావు శ్రామిక భవన్‌లో ట్రంప్ సుంకాల యుద్ధం ప్రచార పుస్తకాలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ, పాడిపరిశ్రమలు, కోళ్ల పరిశ్రమలు, పత్తి, పప్పు దినుసులు, రబ్బరు, జీడిపప్పు, టీ, కాఫీ, సుగంధ ద్రవ్యాలు, దస్తులు, వస్త్ర పరిశ్రమ, ఆక్వా ఎగుమతులపై ట్రంప్ సామ్రాజ్యవాదం విధించిన 50 శాతం సుంకాల ప్రభావం దేశ అభివృద్ధికి ఆటంకంగా మారిందని చెప్పారు. వీటి ప్రభావం కోట్లాది మంది భారతీయులపై పడుతుందని పేర్కొన్నారు. తద్వారా కార్మికులకు ఉపాధి అవకాశాలు దెబ్బతిని నిరుద్యోగం పెరిగి, ఆదాయాలు తగ్గి దేశ ఆర్థిక వ్యవస్థ దివాలా తీసే ప్రమాదం ఉందన్నారు. వీటితో పాటు విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను దెబ్బతిసే హెచ్‌బి వన్ వీసాల జారీ కఠిన నిర్ణయాలు దేశ ప్రజానీకాన్ని అవమానించి వెల్లగొట్టే విద్వేషచర్యలను ఖండించాలన్నారు. ఇటువంటి పరిస్థితిలో ట్రంప్ టారిఫ్ టెర్రరిజంపై ప్రధాని మోడి నోరు మెదకపోవడం ఎందుకని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.సురిబాబు, నాయకులు సూర్యనారాయణ పాల్గొన్నారు.

నకిలీ మద్యానికి ఎక్సైజ్ శాఖ అండగా నిలుస్తుంది

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో నకిలీ మద్యం విక్రయాలకు ఎక్సైజ్ శాఖ స్థానిక అధికారులు అండగా నిలుస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు పోతిన మహేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని శ్రీనివాస వైన్స్‌పై అనేక ఫిర్యాదులు సాక్ష్యాలతో ఇచ్చినా ఎక్సైజ్ సీఐ గోపాలకృష్ణ ఎందుకు ఒక్క చర్య కూడా తీసుకోలేదని ప్రశ్నించారు. ఎక్సైజ్ సీఐ గోపాలకృష్ణ జనార్ధన్‌రావుతో విస్కీ సోడాల కలిసి బాగా పని చేశారని బయట మాట్లాడుకుంటున్నారని ఆరోపించారు. ఎప్పుడు ఫిర్యాదు ఇచ్చినా శ్రీనివాస వైన్స్ దగ్గర ఉన్న రోడ్డు మీద ఉన్న తాగుబోతుని చెదరగొట్టి రెండు ఫొటోలు తీసి ఫిర్యాదుకి సమాధానం జతపరిచేవారని పేర్కొన్నారు. అనేకసార్లు ఎక్సైజ్ శాఖ ప్రభుభాస్కర్‌కు ఫిర్యాదు చేస్తే చర్య తీసుకోకపోగా శ్రీనివాసవైన్స్‌కి మరింత వ్యాపారం జరిగేలా పర్మిట్ రూమ్‌కు అనుమతి ఇచ్చారన్నారు. ఇంతకన్నా అవినీతి అక్రమం ఎక్కడైనా ఉంటుందా? అని ప్రశ్నించారు.

సత్తా చాటిన మైక్రోబయాలజీ పీజీలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): హైదరాబాద్‌లోని నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో రెండు రోజుల పాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఐఎఎంఎంటీఏపీసీ వార్షిక సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో పాల్గొన్న ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగం పీజీలు వివిధ అంశాల్లో సత్తాచాటారు. అందులో భాగంగా డాక్టర్ పి. సాయి అవినాష్ మైక్రోబయాలజీలో కృష్ణారావు మెమోరియల్ ఉత్తమ మౌఖిక ప్రదర్శనలో రెండవ బహుమతి గెలుపొందారు. డాక్టర్ అబ్దుల్ రజాక్ – క్విజ్ పోటీలో మూడవ స్థానం పొందారు. కాగా డాక్టర్ అశ్విని కిరణ్, డాక్టర్ డి. రాధాదేవి, డాక్టర్ ఎం. విశ్వనాథ్ ప్రజెంటేషన్‌లో 110 మంది విద్యార్థులు పాల్గొనగా టాప్ 10లో స్థానం పొందారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ఏఈవోలు, సూపరింటెండెంట్లకు అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఏఈవోలు, సూపరిండెంటెంట్లను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఆలయ ఈవో శీనానాయక్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఏసీ సీహెచ్ రంగారావు సీవీ రెడ్డి చారిటీస్, లాండ్స్, లీగల్ సర్వీసులతో పాటు ఆర్‌టీఐ యాక్ట్ ఫైల్స్‌ను పర్యవేక్షిస్తారు. ఏఈవో వెంకటరెడ్డికి ప్రధాన ఆలయం, ప్రొవిజన్ స్టోర్స్, ఫెస్టివల్, పూజలు, శారీష్ సెక్షన్, గోశాల బాధ్యతలు అప్పగించారు. ఎం. తిరుమలేశ్వరరావుకు కేశఖండనశాల, దుర్గాఘాట్, పంచహారతుల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. పి.సుధారాణికి అన్నదానం, సత్రాల నిర్వహణ, పి.చంద్రశేఖర్‌కు ప్రసాదాల తయారీ, దత్తత దేవాలయాలు, వేద పాఠశాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఎన్. రమేష్‌బాబుకు లీజెస్, ఆడిట్, ట్రస్ట్ బోర్డు, ఫస్ట్ ఎయిడ్, ఎంపీఫామ్స్, స్టేషనరీ, కొండ దిగువన, ఎగువన కౌంటర్ల పర్యవేక్షణ అప్పగించారు. కె. గంగాధర్‌కు కనకదుర్గ ప్రభ, పీఆర్వో, సబ్ టెంపుల్, ప్రోటోకాల్, డోనర్ సెల్, ధర్మపథం నిర్వహణ బాధ్యతలు కేటాయించారు. ఎంఎస్ఎల్. శ్రీనివాస్‌కు పరిపాలనా విభాగం, సెక్యూరిటీ, శానిటేషన్, రికార్డు రూమ్‌లను పర్యవేక్షిస్తారు.

సూపరిండెంటెంట్లకు....

పి.భాగ్యజ్యోతికి అన్నదానం, కొండ ఎగువ, దిగువన ప్రసాదాల కౌంటర్ల పర్యవేక్షణ, వై.హేమ దుర్గాంబకు కేశఖండనశాల, దుర్గాఘాట్ పంచహారతుల నిర్వహణ, ఆడిట్, జనరల్ పర్యవేక్షణ, వి.సత్యనారాయణ మూర్తికి దత్తత దేవాలయాలు, సత్రాల నిర్వహణ, వేద పాఠశాల నిర్వహిస్తారు. కె. శ్రీనివాసరావు (చందు)కు ప్రధాన ఆలయం, సబ్ టెంపుల్స్, కొండపై గోశాల, ప్రచారథం నిర్వహణ అప్పగించారు. డీవీవీ సత్యనారాయణకు లీజెస్, లాండ్స్ విభాగ బాధ్యతలు కేటాయించారు. కె. హరికృష్ణకు కనకదుర్గప్రభ, హెచ్‌డీపీ, టోల్ ఫ్రీ కౌంటర్ పర్యవేక్షణ అప్పగించారు. పి.సునీతకు ఫెస్టివల్, పూజలు, ఫ్రూట్స్, ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వహణ బాధ్యతలు కేటాయించారు. బి.కళ్యాణికి ప్రొవిజన్ స్టోర్స్, జీఎస్టీ, ఐటీ విభాగ నిర్వహణ అప్పగించారు. సీహెచ్‌వీ నరసింహరాజుకు పరిపాలనా విభాగం, లీగల్ సర్వీసు వ్యవహారాలు, రికార్డు రూమ్, ట్రస్ట్ బోర్డు బాధ్యతలు అప్పగించారు. కొర్రెల శ్రీనివాసరావు ప్రసాదం తయారీ, కొండ ఎగువ, దిగువన కౌంటర్ల నిర్వహణ, బీఎస్. జగదీష్ ప్రసాద్ మొయిన్ టెంపుల్, సబ్ టెంపుల్, శారీస్ విభాగ బాధ్యతలు అప్పగించారు. ఎం. శ్రీనివాసరావు, ఎల్.శ్రీనివాసరావులకు ప్రోటోకాల్, డోనర్ సెల్, కొండపైన, దిగువన ప్రసాదాల కౌంటర్ల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.